ఏడాదిలోపలతండ్రినికావాలి

చిన్నకథ

ఈ కథానాయకుడు
మొదట పెళ్ళి వద్దనుకుంటాడు.
పిమ్మట పెళ్ళికావాలి కాని పిల్లలు వద్దనుకుంటాడు.
ఆపిమ్మట పిల్లలున్నూ కావాలనుకుంటాడు.
కాని ఈలోగా జరిగిన వివేకభ్రష్టసంపాతం వల్ల
తుదికోరిక తుదిముట్టనికోరిక ఔతుంది.

రచయిత:
గౌరావఝుల వెంకటసుబ్బరామయ్య

౧

రఘునాధుడు బి. ఏ. ప్యాసుచేశాడు. వయస్సు 20 సంవత్సరాలు. ఇంకా వివాహం కాలేదు. పెండ్లి అంటే అతనికివున్న అయిష్టతను చూచి ఇంట్లో ఆడవాండ్లు పడుతూన్న దిగులుకు అంతులేదు. రిటైర్డు రైల్వేక్లర్కు సుబ్రహ్మణ్యం రఘునాధునికి బ్రహ్మచర్యాన్నిగూర్చి ఉపదేశిస్తూ వుండేవాడు. అతనికికూడా ఇతని పట్టుదలమీద ఆశ్చర్యం కలిగింది. దానికిప్పుడు ప్రతికూలాభిప్రాయమివ్వడానికి సుబ్రహ్మణ్యానికి మనస్సు అంగీకరించడం లేదు.

ఈవిషయంలో కుమారుడితో తర్కించి ఉన్నగౌరవం పోగొట్టుకోవడానికి తండ్రి గోవిందబాబుకు ఇష్టంలేదు. అతని ముందర ఎవ్వరూ పెండ్లిమాట ఎత్తకూడదు. ఒకదినం భోజనసమయంలో మేనత్త భయపడుతూనే పెండ్లిమాట ఎత్తితే రఘునాధుడు ఇస్తరి వదలి లేచిపోయాడు. పెద్దలు పెండ్లిసంగతి ఎత్తితే మౌనంతాలుస్తాడు. సమవయస్కులు ఆసంగతి ఎత్తితే వారితో తర్కించి పెండ్లి అంటే అతనికివున్న అయిష్టతను వెలిబుచ్చుతాడు. ఆవ్వూరివారందరూ పెండ్లిఅంటే ఇతనికి వున్న అయిష్టతను చూచి ఆశ్చర్యం పొందుతూ వుండేవారు.

రఘునాధుడు సుబ్రహ్మణ్యాయింటికి పోవడం ఇప్పుడు బొత్తుగా మానివేశాడు. అదిన్నీగాక అతనిని చూచుటకూడా ఇతనికి భయంగావుండెను. తన తండ్రిమాటవిని పెండ్లి చేసుకోమని అతను ఎక్కడ చెపుతాడోనని ఇతని దిగులు.

ఒకదినం సుబ్రహ్మణ్యం, గోవిందబాబు కలుసుకొని రఘునాధుని విషయమై ముచ్చటించి ఇద్దరూ కలసి ఒక వుపాయం ఆలోచించేరు.

౨

మరునాడు సుబ్రహ్మణ్యం భోజనంచేసి మామూలుగా బజారుకు పోలేదు. ఇంటివద్దనే వుండిపోయి రఘునాధుడు మధ్యాహ్నంభోజనానికి పోతూండగా పిలిచాడు. రఘునాధునకు ఆశ్చర్యం, కొంచెం సంకోచం కూడా కలిగింది. విధిలేక ఇంటిలోనికి పోయినాడు. ఇద్దరూ కూర్చొనిన పిమ్మట—

సుబ్ర:—రఘూ! ఎమ్.ఏ. చదువుతావా?

రఘు:—నాఉద్దేశంకూడా అదే.

సుబ్ర:—నీవుద్దేశం వుంటే అడ్డేముంది?

రఘు:—ఇంట్లోవాళ్ళదే.

సుబ్ర:—ఏమీ?

రఘు:—ఇదే, ఇంట్లోవాళ్ళందరూ పెళ్ళిచేసుకోమని చెపుతున్నారు. నాఉద్దేశం మీకు తెలియనే తెలుసుగదా!

సుబ్ర:—ఏమిటీ! ఇంతవరకూ నీవా విషయంలో దృఢసంకల్పుడవైయ్యే వున్నావా? (అని ఎరుగనివానివలె ప్రశ్నించాడు.)

రఘు:—ఆఁ ఔనండి (—రఘునాధుని మనసు ఆనందంతో నిండిపోయింది:—) నన్ను వా

ళ్ళ వీళ్ళ మాదిరి అనుకున్నారా? నేను ఎన్నడూ పెండ్లి చేసుకొని చిక్కుల్లో పడను—దేశ సేవా మార్గమును కంటకాకీర్ణం చెయ్యను — బానిససంతానం వల్ల భూభారాన్ని పెంపొందించను.

సుబ్ర:—శభాస్! రఘూ! శబాస్!! నిజంగా, ప్రపంచంలో నీబోటి దృఢప్రతిజ్ఞులే—కర్తవ్యపరాయణులే— కొద్దో, గొప్పో చెయ్యగలరు.

రఘునాథుని ముఖము విజయగర్వంతో కళకళలాడింది.

3

రిటైర్డు క్లర్కు సుబ్రహ్మణ్యాం మేనగోడలు అందరికీ నచ్చింది. చక్కని చుక్క. ఎనిమిదోక్లాసు వరకు చదివింది. ఆస్తంతా ఇస్తామన్నారు. అయినా రఘునాథువద్ద లాభంలేకపోయింది. అందరూ ఇతని వెఱ్ఱిని పోగొట్టాలని లోలోన విశ్వప్రయత్నాలు చేయసాగారు. ఇద్దరు ముసలివాళ్ళ—సుబ్రహ్మణ్యాం, గోవిందబాబుల— అభిప్రాయాలు ఏకమైనాయి. ఇద్దరి నిశ్చయం ఒకటే. ఆనిశ్చయపూర్తికై చేయుపన్నాగం నెరవేర్చేటందుకు పనులు చురుకుగా జరుగుతున్నాయి.

౪

ఆమె దూరం సంబంధంలో మేనత్తవరుస. వచ్చి వారంరోజులైంది బీదది. వెంట ఏమీ సామాను లేదు. రెండుమూడు రోజుల క్రిందట వివాహచర్చ జరిగింది. నాలుగోరోజున వచ్చి హాజరైంది— 16 సంవత్సరాలబాల.

రఘునాథుడు ఇంతకుముందు ఆమెను చూడలేదు. సరికదా, పేరైనా వినివుండలేదు. ఎవతో అయివుంటుం దనుకున్నాడు. అదిగాక ఇంతవరకు ఇంటివిషయమై తెలుసుకోవలసిన అవసరం ఏమీ అతనికి లేకుండావుండేది. ఇంతవరకు అతగాడు పుస్తకాలు, టెన్నీసు, క్లబ్, సినీమాలు వీటిల్లోనే మునగానాం తేలానాం.

మరి యీపిల్లో?. . .

ఎక్కడో చూచినట్లున్న దే! మనస్సును ఆకర్షిస్తున్న దే! చూచి కొంచెం సిగ్గుపడుతాడు. సిగ్గుపడితే గుట్టు బైటపడుతుంది. పోనీ, మాట్లాడుదామా? సిద్ధాంత భంగమౌతుందని భయం. ఈరెండూ కాకపోయినా నలుగురిలో ఎగతాళిపంచాంగం ఔతుందని బెంగ. ఇందువల్ల కాలాన్నంతా బైటనే గడపసాగాడు మిత్రులసహవాసం గిట్టదు. టెన్నీసు రుచించదు. క్లబ్కుపోవటమే లేదు. సినీమా రాత్రిపూట వస్తువ. ఇందువల్ల పగలల్లా పార్కుల్లో, నదిఒడ్డున, ఐతిహాసిక శిథిలభవనాల్లో గడుపుతున్నాడు. సిద్ధాంతభంగభయం, పాపం అతన్ని అకస్మాత్తుగా ఎంత భావుకుణ్ణి చేసింది!

౫

నేడు మరల రఘునాథుని సుబ్రహ్మణ్యాం పిలిచాడు. 'ఎక్కడవుంటున్నావు? ఏంచేస్తున్నావు? ఇంటితో ఎందు కింతవైరాగ్యం వహించావు?' అని అడిగాడు.

రఘునాథుడు అతనికి ఆత్మసమర్పణచేస్తూ, ఇట్లుచెప్పేడు: 'తాతగారూ! నేడొకమాట మీతో చెప్పతలుచుకున్నా. దానికై నన్నేమీ అనవద్దు.'

సుబ్రహ్మణ్యాం వప్పుకున్నాడు.

రఘు —నేను ప్రస్తుతం వివాహ విషయమై గంభీరంగా ఆలోచిస్తున్నా. (కొంచెంఆగి) చూడండి! నన్ను ఏమైనా అనండి. వివాహంచేసుకోతలుచుకున్నా. ఇది నాకు నచ్చింది...తరువాత్త మీయిష్టం.

సుబ్ర —వాహ్! ఇందులో నా యిష్టం ఏముంది! ఇదిస్వాభావికమే. ఇరవై రెండు సంవత్సరాలవాడివైనావు. తలిదండ్రులకు ఏకపుత్రుడవు —ఇలాంటప్పుడు పెండ్లి చేసుకోకపోతే...

రఘు—ఆఁ. నేనూ ఎంతో ఆలోచించా. కుటుంబంలోని పెద్దల్నందర్నీ కష్టపెట్టటం బాగుండదని తోచింది.

సుబ్ర·—నిజమే...

రఘు:—ఇక దేశసేవ. సంగతి ఏమిటంటారేమో! దేశసేవకి సంతానం ప్రతిబంధకంగాని భార్య కాదు. ఇక సంతానమా, అది చేతిలోని పని. పురుషునికి సంయమంగావుండటం ముఖ్యావసరం.

సుబ్రహ్మణ్యాం రఘునాథుని రంగుమార్పుచూచి లోలోన నవ్వుకొని "అంతా బాగున్నది. నీవ్వుత

ష్టక పెండ్లి చేసుకోవలసిందే. పెళ్లి బూర్లుతిని చాలారోజులైంది.'' అని నవ్వుతూ అన్నాడు.

పిమ్మట రఘునాథుడు శెలవుతీసుకొని బయటికివచ్చేడు. నాలుగైదు నిమిషాలు గోడకు చెవియొగ్గి విన్నాడు, తన పరివర్తనానికి సుబ్రహ్మణ్యం నవ్వుతున్నాడేమోనని. కాని సుబ్రహ్మణ్యం దీన్నిగురించి ఎందుకు నవ్వుతాడు? మందుపట్టిందికదా అని లోలోన సంతోషించాడు.

౬

పెండ్లిఅయింది. నిగ్రహంఅనే పాతపేలికలు గాలిలో ఎగిరిపోయినాయి. ఇప్పటికిన్నీ సంతాననిరోధపక్షపాతే. వ్యత్యాస మేమిటంటే మొదట సంయమంతోటి సంతాననిరోధం కావాలని, ఇప్పుడు సంయమాన్ని కోరని ఇతరసాధనాలతోటి సంతాననిరోధం కావాలని.

సంతాననిరోధమహిమను స్వయంగా తెలుసుకున్నాడు. పెండ్లికుమార్తెకు దీన్నిగురించి గంభీరంగా తెలుపసాగేడు. 'మేరీ స్టోప్సు' ాలన్నీ తిరగేశాడు. 'మా ియన్‌థీరీ' భక్తుడైనాడు. సంతాననిరోధానికి (బర్తుకంట్రోల్) సమస్త ఉచితానుచితోపాయా చేయసాగేడు.

స్నేహితుల్తో బడాయిలుకొట్టేవాడు. బ్రహ్మచర్యం, సంతాననిగ్రహం వీన్నిగురించి ఉత్సాహంగా ఉపన్యసిస్తూ, సంయమశక్తిలేని దుర్బలవివాహిత మిత్రులను ఎగతాళి చేస్తుండేవాడు. అనుభవజ్ఞులు ఇతని మాటలు విని నవ్వేవారు. సుబ్రహ్మణ్యంగూడా గమనిస్తూవుండేవాడు. నవ్వేవాడు కాదు.

౭

'రఘునాథబాబూ! ఏమిటిది?'

వారంగడిచింది. నెలగడిచి రెండోమాసంగూడా ప్రవేశించింది. వారిప్రేమ దినదినాభివృద్ధి చెందసాగింది. రఘునాథుడు పూర్వచరిత్రకూ ఇప్పటిదానికీ తారతమ్యం చూచుకునేవాడు. ప్రతిక్రియలన్నీ వ్యర్థమయ్యాయే! జాగ్రత్తంతా వ్యర్థమైందే! కాపరం ప్రారంభించి ఆరునెలలుకూడా నిండలేదే! చింతాక్రాంతుడైనాడు. స్టోప్సుపుస్తకాలన్నీ తిరగేశాడు. వైద్యగ్రంథాలన్నీ చదివాడు. చిట్కాలు ఏరుకున్నాడు. ఒకరోజున బలవంతంగా మందు తాగించాడు.

౮

ఐదుసంవత్సరాలు గడిచినాయి. దేశసేవాకార్యము నిలబడిపోయింది. రఘునాథుడు సంసారసాగరంలో పడ్డాడు. పొట్టతిప్పలకొరకు పని వెతుక్కోవాలసి వచ్చింది. కాని ఇదీ ఒకసుగుణమే—ఇంతవరకు సంతానం కలుగలేదు. ఆహా! ఎంతచక్కని జబాబు! ఒక ఔన్సుతో పని పూర్తిఅయింది.

రఘునాథుడిప్పుడు నోటితో ఏమీచెప్పడు. లోలోన ఆమందును తిడతాడు. ఆపుస్తకాలను పరశురామప్రీతి చేశాడు. మేరీస్టోప్సును, మాల్థస్సును తెరిపిలేని శాపాలకు గురిచేస్తున్నాడు.

ఇరవై రెండుసంవత్సరాల లోపుగా ఆడదానికి సంతానం కలక్కపోతే ఇకముందు కలగటం దుర్లభమని ఎవరోఅన్నారు. ఇంకేముంది? సంతానంకోసం విశ్వప్రయత్నం చేయసాగాడు. ఒక్కమొగపిల్లవాడు, లేకపోతే ఒకఆడపిల్లైనా చాలు. ఇదే అతనుకోరేది. ఇదికూడా లేకపోతే ప్రయోజనమేమున్నది? పెండ్లి చేసుకున్నదెందుకు? పిల్లలకేగా మరి?

ఐతే దీనికోసం పాతల్లాడటం పనికిరాదు అని అనుకుంటాడు. కాని మరుక్షణంలో ఈతర్కాలతో అవసరంలేదు, ఈవిచారాలతో పనిలేదు. ఇప్పుడు సంవత్సరంలోపల నేను తండ్రినికావలె. ఏమన్నాకానీ, ఎంతైనా డబ్బుఖర్చుకానీ అని అనుకుంటాడు.

మరి దేశసేవో?

'ఉండవయ్యా! అది ఇప్పుడు చెప్పవలసిందికాదు. వీలైనంత తొందరగా తండ్రినికావలె. వంశనిర్మూలం కాకుండా చెయ్యవలె.'

రెండుసంత్సరాలనుంచి డాక్టర్లు నాటువైద్యులు, లేడీడాక్టర్లు, మందులుఇచ్చి విసికారు. వాళ్లనుంచి కేసు భూతవైద్యులు, సాధువులు, సన్యాసులు, ఫకీర్లు, జడదారులు వీళ్లపాలిటపడ్డది. సంతానం కలుగుతుందంటే చాలు. వాడిపంట పండినట్టే. విభూతిపెట్టేవాండ్లకు, దిష్టితీసేవాండ్లకు అంతులేదు.

ముసలితలిదండ్రుల చింతకు వే

రేలేదు. ఇక భార్యాభర్తలకో? వారి మనోభావం వర్ణనాతీతం. ఒకరి మనోభావాన్ని ఒకరు వెలిబుచ్చరు. వారి మనస్సులు సంకోచం వల్ల కుందుతున్నాయి.

రఘునాథుడు నేటికి జిమ్మేదారీ తెలుసుకున్నాడు. ఇతరపిల్లల్ని దగ్గరతీయ మొదలుపెట్టాడు. పిల్లలంటే గిట్టనివాడు నేడు పరాయి పిల్లల్ని అబ్బాయీ! ఇలారావమ్మా, అని అతిప్రేమతో పిలువసాగేడు. అప్పుడు అతనికి చిత్తశాంతి కలిగేది. తన ఆయావనోద్ధృతపు తోందరకు తన్ను ఎన్నిసార్లు తిట్టుకున్నాడో, ఆమంకును ఎన్నిసార్లు దూరినాడో, ఆమందును సృజించిన భగవంతునికూడా ఎన్నిసారులు దూషించినాడో...

౯

పిల్లవాడుకలిగే యోగంలేదు, కలుగలేదు. రఘునాథుడు వృద్ధుడైనాడు. కాని అతనికిప్పుడు అంత సంతానేచ్ఛలేదు. దీన్ని అదృష్టమందామా? కర్మఫలమందామా? అదృష్టాన్ని అతను ఒప్పుకోడు. ఒప్పుకొనేదిమటుకు ఎల్లా? తనుచేసిందానికి చికిత్సో? అప్పూరి బీదపిల్లలకు పుస్తకాలు, గుడ్డలు, స్కూలుజీతాలు మొదలైన సహాయం చేయసాగేడు.

ఒకరోజున అతను వార్తాపత్రికలో అతనిస్నేహితుని కుమారుడు సివిల్ సర్వీసులో ప్రవేశించెనని చదివేడు. కొంతసేపు విచారసాగరంలో మునిగిపోయాడు.

ఇంతలో ఒకపిల్లవాడువచ్చి—తాతా! నేను పరీక్షలో అందరికంటె ఫస్టున ప్యాసుఅయినాను—అని చెప్పెను. అతను సంతోషించి ఆ పిల్లవాని వీపును నిమురసాగేడు.

ఒకరోజున అతనిమిత్రుడు ఒకడు విందుకు పిలిచేడు. అతనికుమారుని వివాహము. మరల రఘునాథునిముఖము ఖిన్నమైపోయింది.

కాని ఇంతలో అతనిభార్య ఒక పిల్లవానిని ఎత్తుకొనివచ్చి—వీణ్ణి బజారుకు తీసుకుపోయి మిఠాయికొని పెట్టండి. పాపం చాలాసేపటినుంచి యేడుస్తున్నాడు అనిచెప్పెను. రఘునాథుడు నవ్వుచు ఆపిల్లవానిని ఎత్తుకొని బజారుకు తీసుకొనిపోయాడు.

“సీ. జలధరంబన నెద్ది పాలపంబు పుట్టించు నిల్లాలి మెఱుఁగుల మొల్లములకు
మున్నీరనఁగ నెద్ది మొలచుట కావాల మాణిపూసలువోని యాత్మజాలకు
గీ. నట్టి గృహమేధిధర్మంబునందు నీవు, గుత్ససేయుట నీరీతి గొడవయొదవె
నొప్పుగతి నొప్పుగఁగల్గ దుద్ధతులకు, గసరిపైవచ్చు జాళ్ళపై గాలియైన.”

ఉచితము! 160 పుటల గ్రంథము!

వచన భగవద్గీత

200 సంవత్సరముల క్రిందట తుపాకుల అనంతభూపాలునిచే మూలమునకు సరిగా, తేనెవంటి మధురశైలిలో తెనిగింపబడినది. అతిసుందరమగు పోకెట్టుకూర్పు. 160 పుటలు. ఈ మహద్గ్రంథమును ఉచితముగ పంచిపెట్టుటకు కొన్ని ప్రతులు ‘గీతాపరిషత్తు’వారు మాకార్యస్థానమునకు పంపియున్నారు. అభ్యర్థులీయంశములు గమనింతురు గాక!

౧. ఒక చిరునామాకు ఒక్క ప్రతిమాత్రమే పంపబడును.

౨. పంపుటకగు వ్యయము 2 అణాలును తపాలుస్టాంపులు జతపరుపవలె. బిళ్ళలంపక వ్రాయుజాబులు వ్యర్థములు.

ఆంధ్రభూమి—వేపేరి పోస్టు—మదరాసు.